RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)
సెల్: 8121133006
9494220260
ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 36 పేజీలు - 04 వెల - 04/- శుక్రవారం 8 నవంబర్ 2024

# విద్యుత్ ఛార్జీల పెంపు
# పాపం జగన్ దే

- అయిదేళ్ల పాలనలో పోలవరంను ముంచారు
- తొమ్మిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు
- విద్యుత్ అంటూ ఏకంగా లక్షా 20వేల కోట్లు అప్పు చేశారు
- భావ ప్రకటన అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ లు
- తనను, పవన్, అనితను సైతం వదలడం లేదు
- ఇక వారందరి తాటా తీస్తాం
- హద్దుదాటిన ప్రతిఒక్కరి అంతు చూడటం పక్కా
- తాళ్లయిపాలెంలో జీఐఎస్ సబ్ స్టేషన్ సభలో చంద్రబాబు



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:
అమరావతిని జగన్ ఎడారిగా మార్చేశారని మండిపడ్డారు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు. పోలవరం డయాఫ్రామ్ వాల్ ను నాశనం చేశారని, ఎక్కడ దొరికితే అక్కడ రూ.10లక్షల కోట్లు అప్పు తెచ్చారన్నారు. 20ఏళ్ళు మద్యం తాకట్టు పెట్టి అప్పు చేశారని అన్నారు. అమరావతిలోని తాళ్లయిపాలెంలో జీఐఎస్ సబ్ స్టేషన్ ను ఇవాళ ప్రారంభించారు. దీంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ.5407 కోట్లతో నిర్మించిన సబ్ స్టేషన్లను వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.ఎన్టీఆర్ జిల్లా, గుంటూరు, చిత్తూరు, నంద్యాల, శ్రీ సత్య సాయి, శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ప్రకాశం, తిరుపతి, కడప జిల్లాల్లో విద్యుత్ సబ్ స్టేషన్లను సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వర్చువల్‌గా ప్రారంభించారు. సీఆర్డీయే పరిధిలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తాళ్ళాయపాలెంలో 400 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. ఆర్థిక అభివృద్ధి సాధించడంలో 24x7 గంటలు విద్యుత్ సరఫరా కీలక పాత్ర పోషించనుంది.

మిగతా 2లో



# గ్రామాలు స్వయం సమృద్ధిగా ఎదగాలి

## సర్పంచ్‌ల సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్

- వాలంటీర్లను వైసీపీ మోసం చేసింది...
- ఆ జీవోలో వాళ్ల ప్రస్తావనే లేదు: పవన్ కల్యాణ్
- వలంటీర్లకూ..మేలు చేస్తాం పవన్ కల్యాణ్ భరోసా
- పంచాయితీ నిధులను జగన్ మింగేశారు
- అయిదేళ్లలో గ్రామ సీమలు పూర్తిగా మారిపోవాలి
- త్వరలోనే కావాల్సిన నిధులు అందజేస్తాం

2లో

అమరావతిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో సర్పంచ్ సంఘాల ప్రతినిధులతో గురువారం పవన్ కళ్యాణ్ సమావేశం అయ్యారు.



## రిక్రూట్‌మెంట్ మధ్యలో రూల్స్ మార్చకూడదు.

ప్రభుత్వ ఉద్యోగాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు!
ఈ మేరకు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు
రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా నిబంధనలు ఉండాలని సూచన

2లో

# ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

- చంద్రబాబుపై జగన్ గరం గరం
- సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులపై ప్రభుత్వం ఉక్కుపాదం
- ఆడబిడ్డలపై అసభ్య పోస్టులు పెడుతున్నారంటూ చంద్రబాబు ఫైర్
- సుప్రీం మార్గదర్శకాలు పాటించడంలేదని విమర్శలు



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:
సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టేవారిని వదిలిపెట్టేది లేదంటూ సీఎం చంద్రబాబు ఇవాళ గట్టి హెచ్చరికలు జారీ చేయగా... వైసీపీ అధినేత జగన్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి చంద్రబాబు వ్యాఖ్యలకు బదులిచ్చే ప్రయత్నం చేశారు. సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే చాలు... అక్రమంగా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. వీళ్ల అఘాయిత్యాలపై ఎవరూ ప్రశ్నించకూడదా? ఆఖరికి వరదసాయంపై నిలదీసినా తప్పుడు కేసులు పెడుతున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక, కరెంట్ చార్జీలు, మద్యం మాఫియాపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా? పోర్టుల ప్రైవేటీకరణపై ఎవరూ ప్రశ్నించకూడదా? ప్రభుత్వ ఆస్తులను అమ్మేస్తుంటే ఎవరూ నిలదీయకూడదా? అంటూ ధ్వజమెత్తారు. “విద్య వద్దు... మద్యం ముద్దు అని ఓ పిల్లవాడు పోస్టు పెట్టాడు. ఆ సోషల్ మీడియా యాక్టివిస్ట్ చెప్పిన మాటల్లో తప్పేముంది?

మిగతా 2లో



2లో

## నా ఇంటి పేరు మార్చి రాక్షసానందం పొందారు: షర్మిల

సోషల్ మీడియా పోస్టులపై షర్మిల
సామాజిక మాధ్యమాలు సమాజానికి మేలు చేసేలా ఉండాలని వెల్లడి
సైకోలు సోషల్ మీడియాను భ్రష్టుపట్టించారని విమర్శలు
తల్లి, చెల్లి అనే ఇంగితజ్ఞానం లేకుండా పోస్టులు పెట్టారని ఆగ్రహం

## నటి జత్వానీ కేసు విచారణ వాయిదా

### 26 వరకు ఐపిఎస్ లకు ఊరట



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:
ముంబై నటి జత్వానీ కేసులో ఐపీఎస్ అధికారులకు మరోసారి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కాస్త ఊరట లభించింది.. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఐపీఎస్ అధికారుల ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఈ రోజు హైకోర్టులో విచారణ జరిగింది.. దీనిపైఈ నెల 26వ తేదీ లోగా కౌంటర్ ఫైల్ చేయాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది హైకోర్టు.. ఇదే సమయంలో . నవంబర్ 26వ తేదీ వరకు పోలీస్ అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఇంటీరియమ్ ఆర్డర్స్ పొడిగించింది..కాగా, సినీ నటి జత్వానీ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు ఐపీఎస్ అధికారులు కాంతిరానా టాటా, విశాల్ గున్ని, ఏసీపీ హనుమంతరావు, సీఐ సత్యనారాయణ, అడ్వకేట్ ఇంకొల్లు%ో% ఇదే కేసులో ఇంప్లీడ్ అయ్యారు సినీనటి జత్వానీ.. మొత్తంగా ఈ కేసులో విచారణ 26వ తేదీకి వాయిదా పడడంతో.. అప్పటి వరకు ఐపీఎస్‌లు, పోలీసు అధికారులకు ఊరట లభించినట్టు అయ్యింది..

## వైసీపీ సంచలన నిర్ణయం...
# ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరం

- కృష్ణా-గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికలు
- ఎన్నికలు ధర్మబద్ధంగా జరిగే అవకాశం లేదన్న పేర్ని నాని
- అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలు బహిష్కరిస్తున్నామని ప్రకటన



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:
ఎమ్మెల్సీ ఎన్నికలపై వైసీపీ నాయకత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. కృష్ణా-గుంటూరు, తూర్పుగోదావరి-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. దీనిపై మాజీ మంత్రి పేర్ని నాని మీడియాతో మాట్లాడారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తున్నామని ప్రకటించారు. ఎన్నికలు ధర్మబద్ధంగా జరిగే అవకాశం కనిపించడంలేదని వ్యాఖ్యానించారు. ఓటర్లు ప్రశాంతంగా బయటికి వచ్చి ఓటేసే పరిస్థితి లేదని అన్నారు. ఏపీలో అప్రజాస్వామిక పాలన నెలకొందని, కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శించారు. ఈ నేపథ్యంలో, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయరాదని వైసీపీ నిర్ణయించుకుందని పేర్ని నాని స్పష్టం చేశారు.



2లో

# చంద్రబాబు కృషితోనే
## ఐటీ రంగంలో అద్భుత ఫలితాలు..

### విట్ ఎడ్యుకేషన్ ఫెయిర్ లో మంత్రి నారా లోకేష్.!

-విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలను ఆసక్తిగా పరిశీలించిన మంత్రి.
-అంతర్జాతీయ యూనివర్సిటీల స్టాల్స్ సందర్శన.
-వీఐటీ ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ లాంఛనంగా ప్రారంభం.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# చంద్రబాబు కృషితోనే ఐటీ రంగంలో అద్భుత ఫలితాలు..

## విట్ ఎడ్యుకేషన్ ఫెయిర్ లో సందడి చేసిన మంత్రి నారా లోకేష్.!

**-విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలను ఆసక్తిగా పరిశీలించిన మంత్రి.**

**-అంతర్జాతీయ యూనివర్సిటీల స్టాల్స్ సందర్శన.**

**-వీఐటీ ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ లాంఛనంగా ప్రారంభం.**

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:

ప్రజా రాజధాని అమరావతి ఐనవోలులోని ప్రఖ్యాత విద్యాసంస్థ వీఐటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్ లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆద్యంతం సందడి చేశారు. ముందుగా వర్సిటీ చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు యూనివర్సిటీ నిర్వాహకులు, సిబ్బంది, విద్యార్థులు రెడ్ కార్పెట్ వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎడ్యుకేషన్ పెయిర్ ను రిబ్బన్ కట్ చేసి మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. యూనివర్సిటీ ఆధ్వర్యంలో మొదటి అంతర్జాతీయ ఉన్నత విద్య ప్రదర్శనను పురస్కరించుకుని యూనివర్సిటీ



ప్రాంగణంలో మొక్కను నాటారు. అంతర్జాతీయ ఉన్నత విద్య ప్రదర్శనలో వివిధ దేశాల ప్రతినిధులు ఏర్పాటుచేసిన స్టాల్స్ ను మంత్రి ఆసక్తిగా తిలకించారు. తమ దేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు గల అవకాశాలు, కోర్సుల వివరాలు, అడ్మిషన్లు, ఉపకారవేతనాలు, సౌకర్యాలు వివరిస్తూ అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా,కెనడాకు సంబంధించిన డెలిగేట్స్ ఈ స్టాల్స్ ను ఏర్పాటుచేశారు. స్టాల్స్ మొత్తం కలియతిరిగిన మంత్రి నారా లోకేష్ ఆయా దేశాల ప్రతినిధులతో సంభాషించారు. ఆయా దేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విట్ యూనివర్సిటీ విద్యార్థులు వినూత్నంగా రూపొందించిన వివిధ ఆవిష్కరణలను మంత్రి నారా లోకేష్ వీక్షించారు. వ్యవసాయ పనులకు తక్కువ ఖర్చులో లభ్యమయ్యే, వరదలను గుర్తించగల అత్యాధునిక డ్రోన్ ను ప్రదర్శించగా మంత్రి ఆసక్తిగా తిలకించారు. విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీంతో పాటు విద్యార్థులు రూపొందించిన డ్రైవర్ రహిత వాహనం, రోబోటిక్ హ్యాండ్ రోవర్, స్మార్ట్ డాగ్ కోలార్, నెక్స్ట్ జనరేషన్ పీహెచ్ సెన్సార్స్ కలిగిన శక్తి 2.0, మూడు సెకన్లలో 180 కి.మీ స్పీడ్ అందుకోగల హైస్పీడ్ డ్రోన్, హ్యూమనాయిడ్ రోబోట్ ను మంత్రి పరిశీలించారు. ఆయా ఆవిష్కరణల గురించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమ సృజనతో అద్భుత ఆవిష్కరణలను రూపొందించిన విద్యార్థులను అభినందించారు. వారితో కలిసి సెల్ఫీలు, ఫోటోలు దిగారు.

# గ్రామాలు స్వయం సమృద్ధిగా ఎదగాలి

**వలంటీర్లకూ..మేలు చేస్తాం**

**పవన్ కల్యాణ్ భరోసా**

**పంచాయితీ నిధులను జగన్ మింగేశారు**

**అయిదేళ్లలో గ్రామ సీమలు పూర్తిగా మారిపోవాలి**

**త్వరలోనే కావాల్సిన నిధులు అందజేస్తాం**

**సర్పంచ్‌లను గ్రామ ప్రథమ పౌరులుగా గుర్తిస్తాం**

**గ్రామాలు స్వయం సమృద్ధిగా ఎదగాలి**

**సర్పంచ్‌ల సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్**

విజయవాడ:ఆంధ్ర ప్రగతి నవంబర్ 07:

గత ప్రభుత్వం మోసం చేసిన వలంటీర్లకు మేలు చేయాలనే ఆలోచలతోనే కూటమి ప్రభుత్వం ఉందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. అయతే.. వాళ్లు ఉద్యోగంలో ఉంటే రద్దు చేయవచ్చని, కానీ వాళ్లు అసలు వ్యవస్థలోనే లేరని చెప్పారు. ఇదో సాంకేతిక సమస్య అని. దీన్ని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. అమరావతిలోని డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో సర్పంచ్ సంఘాల ప్రతినిధులతో గురువారం పవన్ కళ్యాణ్ సమావేశం అయ్యారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాబూ రాజేంద్రప్రసాద్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి సర్పంచ్‌లు వచ్చారు. ఈ సందర్భంగా వలంటీర్ వ్యవస్థను రద్దు చేయాలని సర్పంచులు



విజ్ఞప్తి చేశారు.. దీనిపై స్పందించిన పవన్ ఉద్యోగాల్లో లేని వాళ్ల గురించి ఏం నిర్ణయం తీసుకోవాలో అలోచిస్తామని అన్నారు..దేశంలో 70శాతం ప్రజలు పల్లెల్లోనే ఉంటారని.. గ్రామాలను బలోపేతం చేస్తూ గాంధీ సిద్దాంతాలను ముందుకు తీసుకువెళ్లాలనే ఆకాంక్షతోనే తాము ఉన్నామని ఉపముఖ్యమంత్రి పవన్ అన్నారు. మాటలతో కాకుండా చేతలతోనే తమ ప్రభుత్వం పని తనం చూపుతుందని తెలిపారు. సర్పంచ్‌లు ఇచ్చిన 16 డిమాండ్స్‌లో కీలకమైన వాటిని గుర్తించి వాటిని పూర్తి చేశామన్నారు. కేరళలో పని చేస్తున్న అధికారి కృష్ణతేజను డిప్యూటేషన్ మీద తీసుకువచ్చామని తెలిపారు. ఆయన సహకారం వల్లే నేడు గ్రామాల అభివృద్ధికి ప్రణాళికులు సిద్దం చేసి అమలు చేస్తున్నట్లు తెలిపారు. తన పేషీలో ప్రజలకు మేలు చేద్దామనే ఆకాంక్ష ఉన్న అధికారులు ఉండటం అదృష్టమన్నారు.ఎంపీ ల్యాడ్స్ ఫండ్స్ ద్వారా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలు పూర్తి చేస్తామని ఉపముఖ్యమంత్రి పవన్ చెప్పారు. 2014 నుంచి 2019 వరకు చేసిన పనులకు గత ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదని.. ఆ నిధులు విడుదల చేసేందుకు కేబినెట్‌లో నిర్ణయించామని తెలిపారు. అమరావతిలో పంచాయతీరాజ్ భవనానికి రెండు ఎకరాలు కేటాయించాలని తనని కోరారని.. ట్రైనింగ్ సెంటర్ కూడా నిర్మాణం చేసే విధంగా అవసరమైన స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఇక గ్రామాలలో నరేగా పథకం కింద రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలని సర్పంచ్ లను కోరారు. ఇప్పటికే దీనిపై పల్లె వనాలు పేరుతో ఆలోచన చేస్తున్నామని తెలిపారు. సర్పంచ్‌లకు ప్రథమ పౌరుల స్థానం ఇవ్వాలని అప్పుడే వారికి ఆ గుర్తింపు ఉంటుందన్నారు. పంచాయతీలకు నిధులు ఎక్కువ కావాలని.. ఇందుకు స్వయం పోషక పంచాయతీలుగా ఎదగాలని అన్నారు.

సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జడ్పీటీసీలకు వేతనాలు పెంపుపై కూడా కసరత్తు చేస్తున్నామని పవన్ అన్నారు. అయితే పంచాయతీల్లో కూడా ఆదాయ వనరులు పెంచుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. వచ్చే యాభై ఏళ్లలో కలప అవసరం చాలా ఉంటుందని తెలిపారు. అందువల్ల గ్రామాల్లో వెదురుబొంగులను పెంచి.. బయో డీజిల్ తయారీకి సరఫరా చేసేలా చేయాలని సూచించారు. ప్రతి గ్రామం నుంచి కలపను పెంచేలా లక్ష్యాలను నిర్దేశిస్తే ఆదాయం వస్తుందని తెలిపారు

# విద్యుత్ ఛార్జీల పెంపు పాపంజగన్ దే

**(మొదటి పేజి తరువాయి)**

అనంతరం మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 2019లో వచ్చిన ప్రభుత్వం విధ్వంసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు సీఎంగా జగన్ చేసిన పాపాలతో నేడు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని పేర్కొన్నారు. జగన్ దుర్మార్గ పాలనతో రాష్ట్రం వెనకబడిందన్నారు. వైసీపీ పాపాలకు జనం బలవుతున్నారన్నారు. జగన్ చేసిన పాపాలకు బదులుగా ఓటర్లు ఎన్నికల్లో వాతలు పెట్టి ఇంటికి పంపించారన్నారు. దుర్మార్గులకు అధికారం ఇవ్వడమే ప్రజలు చేసిన తప్పన్నారు. కేంద్రం ఇచ్చిన నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని, దీంతో కేంద్రం నిధులు ఇవ్వని పరిస్థితిని తీసుకొచ్చారన్నారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను నాశనం చేశారని చంద్రబాబు విమర్శించారు. జగన్ అరాచక పాలనతో పోలవరం వెనక్కి వెళ్లిందన్నారు. రాష్ట్రంలో రహదారులను గోతుల మయం చేశారన్నారు. అభివృద్ధిని పక్కనపెట్టి గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకుందని ఆరోపించారు.

తాను సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి విద్యుత్తు ఛార్జీలు పెరగవని తాను హామీ ఇస్తున్నట్లు తెలిపారు చంద్రబాబు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే ఇటీవల విద్యుత్తు ఛార్జీలు పెరిగాయన్నారు. పేదలపై విద్యుత్ భారానికి కారణం గత ప్రభుత్వమేనని అన్నారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వాడకుండానే వేల కోట్లు చెల్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్ళలో విద్యుత్ సంస్థల్లో రూ.1 లక్ష 20వేల కోట్లు అప్పు చేశారన్నారు. 9సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.36వేల కోట్లు భారం వేశారన్నారు. పోలవరం, కృష్ణపట్నం పవర్ ప్లాంట్లను నిర్వీర్యం చేశారని.. ఐదేళ్ళలో విద్యుత్ సంస్థల్లో రూ.1 లక్ష 20వేల కోట్లు అప్పు చేశారన్నారు.

1998 లోనే తాను విద్యుత్ సంస్కరణలు తీసుకువచ్చానని గుర్తు చేశారు. తలసరి కరెంటు వినియోగం పెంచాలని సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని అన్నారు. ప్రస్తుతం ఎలాంటి విద్యుత్ సమస్య లు లేకుండా అమరావతిలో సబ్ స్టేషన్ లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అప్పట్లో ఇంటర్ నెట్ కు కూడా తానే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చానని చెప్పారు. ప్రస్తుతం ఫోన్ ప్రతిఒక్కరి దగ్గర ఉందని కానీ దాని గురించి కూడా తానే మొదటిసారి ప్రస్థావించానని అన్నారు. తన తరవాతనే అందరూ మాట్లాడారన్నారు.

### పోస్టులు పెట్టిన వారి తాట తీయడం ఖాయం

ప్రస్తుతం టెక్నాలజీ అభివృద్ధి చెందిందని చెప్పారు. తిరుపతిలో తనపై యాక్సిడెంట్ జరిగిన నాడు టెక్నాలజీ లేదని చెప్పారు. కానీ ఇప్పుడు మీడియాతో పాటూ సోషల్ మీడియా కూడా ఉందని అన్నారు. సోషల్ మీడియాకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. కుటుంబ సభ్యుల గురించి అసభ్య పదజాలంతో దూషిస్తున్నారన్నారు. తన కుటుంబాన్ని అసెంబ్లీలో దూషిస్తే మొట్టమొదటిసారి తాను కన్నీళ్లు పెట్టుకున్నానన్నారు. ఒకప్పుడు విలువలు ఉండేవని ఇప్పుడు అవేమీ లేవని అన్నారు. అనిత ఓ అడబిడ్డ ఆమె గురించి, పవన్ పిల్లల గురించి కూడా మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. మదం ఎక్కువై ఇలాత చేస్తున్నారని ఎవ్వరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు.

# పవన్ తో హోం మంత్రి అనిత భేటి

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత నేడు సమావేశమయ్యారు . ఇటివల పవన్ సోషల్ మీడియాలో ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు %-% పోలీసుల రియాక్షన్‌పై పవన్ ఇటీవల అసహనం వ్యక్తం చేశారు. ఇలా పోలీసులు నిర్లక్ష్యంతో వ్యవరిస్తే . తాను హోంమంత్రి అవుతానని అన్నారు..తాను ఆ పదవి చేపడితే రాష్ట్రంలో పరిస్థితులు వేరేగా ఉంటాయని



వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలోనే నేడు రాష్ట్ర సచివాలయంలో పవన్ ను నేడు అనిత కలిశారు. ఈ సందర్భంగా గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు , హోంశాఖ తీసుకుంటున్న చర్యలను పవన్ కు హోమ్ మినిస్టర్ వివరించారు.. దీన్కి స్పందించిన పవన్ కల్యాణ్ చిన్నారులు, మహిళలపై జరుగుతున్న నేరాల విషయంలో ప్రత్యేకంగా దృష్టి సారించాలని అనితను కోరారు. ఆడబిడ్డలకు అన్యాయం చేసిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించేలా గట్టి చర్యలు తీసుకోవాలని సూచించారు. జన సంక్షేమం, శ్రేయస్సు కోసం ప్రతిక్షణం పరిశ్రమించే ప్రజా ప్రభుత్వంగా కూటమిని ముందుకు తీసుకెళ్లాలని హోమ్ మంత్రికి చెప్పారు పవన్ ..

# 13న విజయవాడలో భిన్నత్వంలో ఏకత్వం

**-మంత్రి ఎన్ఎండి ఫరూక్ ను ఆహ్వానించిన నిర్వాహకులు.**

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:

విజయవాడలో ఈనెల 13వ తేదీన భిన్నత్వంలో ఏకత్వం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథిగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ హాజరుకానున్నారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి హాజరుకావాలని రాష్ట్ర మైనార్టీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి



ఎన్ఎండి ఫరూక్ ను నిర్వాహక ప్రతినిధులు ఆహ్వానించారు. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారూఖ్ షుబ్లి ఆధ్వర్యంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఏపీ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు, మాజీ ఐఏఎస్ అధికారిణి కానన్ త్రివేది, మరో సభ్యుడు సురేష్ కోరే బృందం మంత్రిని కలిసారు. భిన్నత్వంలో ఏకత్వం కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

# ప్రశ్నిస్తే అక్రమ కేసులా?

**(మొదటి పేజి తరువాయి)**నిజమే కదా... అమ్మ ఒడి ఇవ్వడంలేదు, విద్యా దీవెన ఇవ్వడంలేదు, వసతి దీవెన ఇవ్వడంలేదు. నాన్నకు ఫుల్లు... అమ్మకు నిల్లు అని ఆ పోస్టులో ఉంది... అందులో ఏం తప్పుంది? చంద్రబాబు గారి అభిమానుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆ పోస్టు ఉందని కేసు పెట్టారు.మరో పోస్టును ఫార్వార్డ్ చేసినా కేసు పెట్టారు. జనసేన నేతలతో బలవంతంగా కాళ్ళు పట్టించుకుంటున్న టీడీపీ నేతలు... అని ఆ పోస్టులో ఉంది. ఇలాంటివి అన్ని టీవీ చానళ్లలో కూడా వచ్చాయి. ఆ విధంగా వచ్చిన దాన్ని వీళ్లు ఫార్వార్డ్ చేశారంతే! పాపం... వాళ్ల మీద కూడా కేసు పెట్టేశారు. మరో సోషల్ మీడియా యాక్టివిస్టు... చంద్రబాబు, పవన్ విజయవాడ వరదల పేరుతో రూ.534 కోట్ల ప్రజాధనం లూటీ చేశారని... కేవలం కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకే రూ.23 కోట్లు ఖర్చు అని ఆ వ్యక్తి పేర్కొన్నాడు. ఇవి అందరూ అంటున్న మాటలే. ఈ పోస్టు పెట్టినందుకు కూడా కేసు బుక్ చేశారు. తిరుమల ఆలయంలో చంద్రబాబు తలపై పట్టువస్త్రాలు పక్కకు ఒరిగితే.... లడ్డూ వ్యవహారంలో చంద్రబాబు అసత్యప్రచారం వెంకటేశ్వరస్వామికి కూడా నచ్చలేదు... అందుకే పట్టువస్త్రాలు పక్కకి పడిపోయాయి అంటూ మరో సోషల్ మీడియా యాక్టివిస్టు పోస్టు చేశాడు... పాపం, అంతకంటే అతడేమీ అనలేదు... కానీ అతడిపైనా కేసు పెట్టేశారు. వారం రోజులుగా ఈ తంతు విచ్చలవిడిగా జరుగుతోంది. 101 మందిని బుక్ చేసేశారు.ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసుల విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు ఇచ్చింది. ఇలాంటి కేసుల్లో ఇష్టం వచ్చినట్టు ఇంటికొచ్చి అరెస్ట్ చేయకూడదు, ఇష్టంవచ్చినట్టు అరెస్ట్ చేసి తీసుకెళ్లకూడదు... ఇలా ఏడేళ్ల లోపు శిక్ష పడే కేసులకు ఓ ప్రొసీజర్ ఉంది. 41ఏ కింద నోటీసులు ఇచ్చి విచారణ చేయాలి.

విచారణ జరిపిన తర్వాత ఒకవేళ నిజంగా అరెస్ట్ చేయాల్సిన అవసరమే వస్తే... ముందు వారెంట్ జారీ చేయాలి, ఆ తర్వాత మేజిస్ట్రేట్ పర్మిషన్ తీసుకోవాలి... ఇవి నేను చెబుతున్నవి కాదు... ఇవి సుప్రీంకోర్టు ఆదేశాలు. కానీ ఎక్కడా ఆదేశాలు పాటిస్తున్న దాఖలాలు కనిపించడంలేదు. ప్రశ్నించే గొంతుకలు నొక్కేసే విధంగా అక్రమ కేసులు, అక్రమ నిర్బంధాలకు పాల్పడుతున్నారు" అంటూ జగన్ విమర్శనాస్త్రాలు సంధించారు.

## నా ఇంటి పేరు మార్చి రాక్షసానందం పొందారు: షర్మిల

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:

ఏపీ అధికార టీడీపీ కూటమి, వైసీపీ మధ్య సోషల్ మీడియా పోస్టులపై తీవ్రస్థాయిలో మాటల యుద్ధం నడుస్తోంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కూడా ఈ అంశంపై స్పందించారు. సోషల్ మీడియా ఎల్లప్పుడూ సమాజానికి మేలు చేసేలా ఉండాలని అభిలషించారు. కానీ, కొందరు సైకోలు సైకో పార్టీలతో కలిసి సోషల్ మీడియాను భ్రష్టుపట్టించారని తెలిపారు.

మానవ సంబంధాలు, రక్తసంబంధాలు మరిచి మృగాల్లా మారారని... తల్లి, చెల్లి అనే ఇంగితజ్ఞానం లేకుండా పోస్టులు పెట్టారని షర్మిల మండిపడ్డారు. ప్రశ్నించే మహిళలపై అసభ్యకర పోస్టులతో రాక్షసానందం పొందారని విమర్శించారు. 'సోషల్ మీడియా సైకోల బాధితుల్లో నేను కూడా ఉన్నాను. అసభ్యకర పోస్టులతో పరువుప్రతిష్ఠలు దెబ్బతీసేలా వ్యవహరించారు. దారుణమైన పోస్టులతో పైశాచిక ఆనందం పొందే సైకోలపై కఠిన చర్యలు తీసుకోవాలి. నాపై, నా తల్లిపై, నా సోదరి సునీతపై విచ్చలవిడిగా పోస్టులు పెట్టారు. నేను వైఎస్ రాజశేఖర్ రెడ్డికే పుట్టలేదని దారుణాతిదారుణంగా అవమానించారు. నా ఇంటి పేరు కూడా మార్చి రాక్షసానందం పొందారు. నాపై అసభ్యకర పోస్టులు పెట్టిన వర్రా రవీందర్ రెడ్డిపై నేను కేసు పెట్టాను. సైకోలా పోస్టులు పెట్టిన వర్రా రవీందర్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాం. దారుణమైన పోస్టులు పెట్టేవారు ఏ పార్టీలో ఉన్నా వారి అంతు చూడాలి" అంటూ షర్మిల పేర్కొన్నారు.

## రిక్రూట్‌మెంట్ మధ్యలో రూల్స్ మార్చకూడదు.

### ప్రభుత్వ ఉద్యోగాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు!

ఆంధ్ర ప్రగతి నవంబర్ 07:

ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియ నిబంధనలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. రిక్రూట్‌మెంట్ మధ్యలో రూల్స్ మార్చకూడదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం గురువారం ఉదయం కీలక తీర్పు వెల్లడించింది. ఉద్యోగ నియామక ప్రక్రియ నిబంధనలు ఏకపక్షంగా ఉండకూడదని కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలో పేర్కొన్న ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాలని తెలిపింది. వివక్షకు తావులేకుండా ఉండాలని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రక్రియలో పారదర్శకత తప్పనిసరి అని సూచించింది. ఇక రిక్రూట్‌మెంట్ మధ్యలో నిబంధనలను మారిస్తే అభ్యర్థులు గందరగోళానికి లోనవుతారని వివరించింది. అందుకే ఉద్యోగ నియామక ప్రక్రియ ప్రారంభానికి ముందు ఒకసారి నిర్ణయించిన రూల్స్‌ను ఎట్టిపరిస్థితుల్లో మధ్యలో మార్చకూడదని స్పష్టం చేసింది.

## బ్యాడ్మింటన్ అకాడమీకి పీవీ సింధు భూమిపూజ

**విశాఖ పెదగదిలి కూడలి స్థలం కేటాయింపు**

**ఏడాదిలో నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయం**



విశాఖపట్నంఆంధ్ర ప్రగతి నవంబర్ 07:బ్యాడ్మింటన్‌పై ఆసక్తి ఉన్న చిన్నారులు, యువతను ఉన్నత స్థాయి పోటీల్లో ప్రతిభ చూపేలా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ప్రముఖ క్రీడాకారిణి పీవీ సింధు అన్నారు. విశాఖపట్నంలోని పెద గదిలి కూడలి సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో బ్యాడ్మింటన్ అకాడమీ నిర్మాణానికి ఆమె తన తల్లిదండ్రులతో కలిసి భూమిపూజ చేశారు.పనులు త్వరగా చేపట్టి ఏడాదిలోగా నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అకాడమీ సామర్థ్యం, శిక్షణ తదితర వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. ఇక్కడ సుమారు మూడెకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు కేటాయించింది.

# నదుల లోని నీటిని ఉపయోగించడంలో విఫలమైన రాయలసీమ



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07: నీటి లభ్యత వున్నప్పటికీ ప్రాజెక్టుల నిర్మాణ, నిర్వహణలో సమతుల్యం పాటించకపోవడం వలన రాయలసీమ వ్యవసాయ యోగ్యమైన భూమిలో కేవలం 9 శాతం భూభాగానికి సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగునీరు లభిస్తుండటంతో నిత్యం కరువు బారిన పడుతున్న రాయలసీమలో జలసంరక్షణ ఆవస్యకతను వివరిస్తూ పుస్తక రూపంలో ముఖ్యమంత్రి గారికి వ్రాసిన విజ్ఞాపన పత్రాన్ని బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో రాయలసీమ సాగునీటి సాధన సమితి కార్యవర్గ సభ్యులు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కు అందజేశారు. వంద రోజులుగా నిరంతరాయంగా కృష్ణా, తుంగభద్ర నదులలో ప్రవహిస్తున్న జలాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైన రాయలసీమ సాగునీటి ప్రాజెక్టుల దుస్థితిపై వివిధ దినపత్రికల నియోజకవర్గ/ జిల్లా ఎడిషన్లలో వచ్చిన వార్తలు, పాలకుల హామీలు, ప్రజల ఆకాంక్షల కూర్పుతో రూపొందించిన పుస్తకంలోని అంశాలను కలెక్టర్ కు వివరించామని బొజ్జా పేర్కొన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల దుస్థితికి గల కారణాలను ప్రభుత్వం సులభంగా అర్థం చేసుకోవడానికి రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతుల ఆధారంగా "బ్రాడ్" గా శిథిల విగ్రహాలు, ఉత్సవ విగ్రహాలు, అసంపూర్ణ విగ్రహాలు, శైశవదశ విగ్రహాలు, జీవచ్ఛవ విగ్రహాలు, ఆశావహ (స్వప్న) విగ్రహాలుగా చేసిన వర్గీకరణను ఈ పుస్తకంలో వివరించామని బొజ్జా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వ్యవసాయ యోగ్యమైన భూమిలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సగటున 30 శాతం భూమికి సాగునీరు లభిస్తున్నదని, కానీ రాయలసీమలోని వ్యవసాయ యోగ్యమైన భూమిలో సాగునీటి ప్రాజెక్టుల ద్వారా కేవలం 9 శాతం భూమికి మాత్రమే సాగునీరు లభిస్తున్న విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చామని ఆయన తెలిపారు. నీటి లభ్యత ఉన్నప్పటికీ ప్రాజెక్టుల నిర్మాణ, నిర్వహణలో సమతుల్యం పాటించకపోవడం వల్ల రాయలసీమ వ్యవసాయ యోగ్యమైన భూమిలో కనీసం 30 శాతానికి కూడా సాగునీరు అందించలేని పరిస్థితి నెలకొందని, ఈ పరిస్థితి వలన ఈ ప్రాంతం కరువు పీడిత ప్రాంతం క్యాటగిరిలోకి నెట్టివేయబడిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. పైన వివరించిన అంశాలను దృష్టిలో ఉంచుకొని రాయలసీమ వ్యవసాయ యోగ్యమైన భూమిలో కనీసం 30 శాతానికైనా సాగునీటి వ్యవస్థను అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వవలసిన అవసరం ఉందిని ఆయన పేర్కొన్నారు. దీని కోసం రాబోయే ఐదు సంవత్సరాలలో సుమారు 35 వేల కోట్ల రూపాయల నిధులను రాయలసీమ ప్రాజెక్టుల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేటాయిస్తే రాయలసీమలో శాశ్వతంగా కరువును, వలసలను నిర్మూలించవచ్చని వివరించారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ యోగ్యమైన భూమిలో రాయలసీమకున్న 42 శాతానికి సమానంగా నైనా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాగునీటి బడ్జెట్లో 42 శాతం నిధుల కేటాయింపులు జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటుగా కేంద్ర ప్రభుత్వం నుండి ప్రధానమంత్రి క్రిషి సించాయి యోజన, స్పెషల్ పర్పస్ వెహికల్ ద్వారా నిధులు, ప్రపంచ బ్యాంకు నుండి నిధులు, రాష్ట్ర విభజన చట్టంలోని ప్రత్యేక ప్యాకేజీ నిధులను కూడా సాధించి రాయలసీమ సాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టడానికి తగిన కార్యాచరణ చేపట్టాలని కోరామని తెలిపారు. ప్రభుత్వ సంకల్పం "రాయలసీమలో ప్రతి ఎకరాకు నీరు" సిద్ధించే దిశగా రాష్ట్ర సాగునీటి బడ్జెట్లో నిధులు కేటాయింపులను ఆశిస్తున్నాం అని బొజ్జా ఈ సందర్భంగా పేర్కొన్నారు.రాయలసీమ సాగునీటి సమస్యల పరిష్కార దిశగా సమితి అందచేసిన నివేదికను, విజ్ఞాపన పత్రాన్ని ప్రభుత్వానికి నివేదించడానికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ కి బొజ్జా ధన్యవాదాలు తెలియజేశారు . బొజ్జా దశరథరామిరెడ్డి తో పాటుగా సమితి ఉపాధ్యక్షులు వై యన్ రెడ్డి, కార్యదర్శి మహేశ్వర రెడ్డి, పౌరసంబంధాల కార్యదర్శి నిట్టూరు సుధాకర్ రావు, సభ్యులు సాకేస్వర రెడ్డి కలెక్టర్ ని కలిసారు

# నంద్యాల జిల్లా కు మీ సహకారం ఎంతో అవసరం సార్

### - అని సీఎం చంద్రబాబు ను కోరిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.





ఆంధ్ర ప్రగతి డోన్ నవంబర్ 07:
నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం బేతంచెర్లలో గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ గా (ఆన్ లైన్ )ద్వారా 220 కె.వివిద్యుత్ సబ్ స్టేషన్ ను ప్రారంభించారు.
ఈ నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నగా ఎంపీ బైరెడ్డి శబరి మాట్లాడుతూ అన్ని రంగాల్లో వెనుకబడ్డ నంద్యాల జిల్లాకు మీ సహాయ, సహకారం ఎంతో అవసరం అని సీఎం చంద్రబాబు ను కోరారు. నాపరాతి పరిశ్రమలు అధికంగా ఉన్న బేతంచెర్ల ప్రాంతంలో నిత్యం విద్యుత్ లోవోల్టేజ్ సమస్య, కరెంటు కోత అధికంగా ఉండడం వల్ల నాపరాతి పరిశ్రమ యాజమాన్యం, కార్మికులు ఇబ్బంది పడేవారని, 2018-2019 లో మీ చేతుల మీదుగా ఈ నూతన విద్యుత్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేశారని, గత ఇదేళ్ళ వైసీపీ పాలనలో నిర్లక్ష్యం కాబడ్డ ఈ సబ్ స్టేషన్ కు మళ్ళీ మీరు ముఖ్యమంత్రి గా అయిన వెంటనే పరిపాలన అనుమతులు మంజూరు చేసి మీ చేతుల మీదుగా ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యుత్ కష్టాలు తొలగించిన మీకు బేతంచెర్ల ప్రాంతం రుణపడి ఉంటుందని సీఎం చంద్రబాబు కు ఎంపీ బైరెడ్డి శబరి చెప్పారు.

# ఐఎంఏ ఆధ్వర్యంలో జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం






ఆంధ్రప్రగతి నంద్యాల నవంబర్ 07: గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకుని భారతీయ వైద్య సంఘం నంద్యాల శాఖ, ఉదయానంద కార్సినోస్ క్యాన్సర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో స్థానిక పి.ఎస్. సి.%c% కె.వి.ఎస్. సి. డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,ఉదయానంద కార్సినోస్ క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ ప్రణీత్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐఎంఏ నంద్యాల శాఖ మరియు ఉదయానంద కార్సినోస్ క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్తంగా రూపొందించిన క్యాన్సర్ పై ప్రజా అవగాహన కరపత్రాలు ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ ఐఎంఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. విద్యార్థులలో ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పిస్తే వారు తమ ప్రాంతాలలో ప్రజలకు వివరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు.ఐ ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ ఐఎంఏ ఆధ్వర్యంలో కళాశాలలు, వివిధ ప్రాంతాలలో ఆరోగ్య అంశాలపై ప్రజా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం సామాజిక బాధ్యతలో భాగంగా వైద్యులు నిర్వహిస్తున్నారని తెలిపారు.డాక్టర్ మధుసూదనరావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు క్యాన్సర్ పై ప్రాథమిక అవగాహన కల్పించారు. క్యాన్సర్ నిపుణులు డాక్టర్ ప్రణీత్ క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, ప్రాథమిక దశలో గుర్తించే విధానాలు, క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ ఐఎంఏ వైద్యులు డాక్టర్ రాజశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ శైలజా రాణి, కళాశాల ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ రామలింగారెడ్డి,తెలుగు అధ్యాపకురాలు వెంకట లక్ష్మమ్మ, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష రూపాయల శాశ్వత సభ్యత్వం తీసుకున్న రామ మద్దయ్య.



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07: రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం 17 వార్డు టిడిపి ఇంచార్జ్ రామ మద్దయ్య గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం (లక్ష రూపాయల సభ్యత్వం) తీసుకోవడం జరిగిందని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ రామ మద్దయ్య ను అభినందించడం జరిగింది.

# మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని నంద్యాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మరియు నూతనంగా టీటీడీ బోర్డు మెంబర్ గా నియమితులైన మల్లెల రాజశేఖర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో, పలు అభివృద్ధి పనులపై వారు చర్చించారు.నియోజకవర్గ అభివృద్ధి మరియు మైనార్టీ సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , కుమ్మరి శాలివాహన ఫెడరేషన్ మాజీ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర , నాగభూషణం రెడ్డి , అడ్వకేట్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకొని సురేష్ స్వామి రక్త దాన శిబిరము





ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07:
నంద్యాల బ్లడ్ బ్యాంక్ నందు గురువారం సుబ్రహ్మణ్య షష్ఠి పురస్కరించుకుని నంద్యాల పట్టణంలోని ఒకటో వార్డు హరిజనవాడకు చెందిన సురేష్ స్వామి ఆధ్వర్యంలో 25 మంది తన మిత్ర బృందం మరియు సుబ్రహ్మణ్య స్వామి మాలధారణ స్వాములు స్వచ్ఛందంగా రక్తదానం చేయడము జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవీంద్ర విద్యా సంస్థలు,బాల అకాడమీ చైర్మన్ జీవి రవీందర్ నాథ్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రక్త దానం ప్రాణ దానంతో సమానము అని రక్త దానం చేసిన మూడు నెలల కాలంలో తిరిగి వృద్ధి చెంది మరియు రక్త దానం చేయుటకు సన్నద్ధం అవటం జరుగుతుందని, ఆపదలో ఉన్న వ్యక్తులకు, గర్భిణీ స్త్రీలు ప్రసవ సమయం నందు రక్తం అవసరం అవుతుందని, కావున యువత రక్తదానం చేయుటకు ముందుకు రావాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమము సుబ్రహ్మణ్య మాల స్వాములు ,సురేష్ స్వామి వారి మిత్ర బృందం,నంద్యాల బ్లడ్ బ్యాంక్ మేనేజర్ అచ్యుత్ తదితరులు పాల్గొని జయప్రదం చేయటమైనది.

# జాతీయ విద్యా దినోత్సవ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీలను ప్రారంభించిన : ఎన్ఎండి ఫిరోజ్






ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07: నంద్యాలలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఈనెల 11వ తేదీన జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకొని అల్వేర నాయకులు అబులైజ్ ఏర్పాటు చేసిన వక్తృత్వపు పోటీలను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ఉర్దూ కళాశాల లో జరుగుతున్న వక్తృత్వపు పోటీలలో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభ చూపించి విజయం సాధించాలని తెలియజేశారు అదేవిధంగా ఉర్దూ కళాశాల అభివృద్ధికి ఖచ్చితంగా మా సహాయ సహకారాలు ఉంటాయని తెలియజేశారు. అనంతరం గెలుపొందిన విద్యార్థినిలకు బహుమతులు ప్రశంసా పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని సునీత , ప్రిన్సిపల్ కరిముల్లా , టిడిపి పట్టణ అధ్యక్షులు ఖలీల్ , సమ్మద్ , ఇసుక చాంద్ , గఫార్ , కళాశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికేసులు భనాయించినా

## భయపడేదిలేదు.. ధైర్యంగా ఎదుర్కొంటా..!

### -ఎమ్మెల్సీ ఇసాక్ బాష





ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07:తనపై ఎన్ని తప్పుడు కేసులు భనాయించినా తాను భయపడేదిలేదని ధైర్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని నంద్యాల ఎమ్మెల్సీ ఇసాక్ బాష పేర్కొన్నారు. నంద్యాల వన్టేన్ పోలీస్ స్టేషన్ నందు ఎమ్మెల్సీ ఇసాక్ బాషపై ఎస్సీ అబ్దుల్ సలాం అనే వ్యక్తి 2013లో జరిగిన కేసుకు సంబంధించి నేడు తనపై కేసు నమోదు చేయడం జరిగిందని, ఈ విషయంపై చట్టపరిదిలో తగిన న్యాయం కోసం పోరాటం చేస్తానని ఎమ్మెల్సీ ఇసాక్ బాష స్పష్టం చేశారు. ఈ మేరకు స్థానిక కార్యాలయంలో మీడియా సమావేశంలో తనపై నమోదు కాబడిన కేసులు, వాటి వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాష మాట్లాడుతూ...2013లో గత 11 సంవత్సరాల క్రితం నంద్యాల పోస్టాఫీస్ వద్ద అపార్ట్మెంట్ నిర్మాణానికి సంబంధించి అబ్దుల్ సలాం అనే వ్యక్తి గొడవ చేయడం జరిగిందన్నారు. ఈ ఘనటలో తమపై ఎస్సీ అబ్దుల్ సలాం దుర్భాషలాడుతూ తోపులాట చేసి ఘర్షణ చేయడం జరిగింది.ఈ విషయంపై నాడు అతనిపై కేసు వేయగా పలు ఆధారాలతో కేసు కొట్టివేయడం జరిగింది. అయితే ఈకేసుకు సబంధించి ఎస్సీ అబ్దుల్ సలాం రాజకీయంగా తనపై నాడు తప్పుడు కేసు బనాయించాడన్న ఆరోపణలు చేస్తూ తనపై వన్టేన్లో కేసు పెట్టడం జరిగిందన్నారు. అలాగే జుమ్మామసీదుకు సంబంధించిన నిధులు దుర్వినియోగం చేశానని ఆరోపణలు చేయడం జరిగిందని ఇది సత్యదూరమన్నారు. అలాగే తాను చేపట్టిన అపార్ట్మెంట్కు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. ఇదిలా ఉండగా తనపై తప్పుడు ఆరోపణలు చేయడం సదరు వ్యక్తికి తగదని, దీనిపై తాను న్యాయస్థానంను ఆశ్రయించడం జరుగుతుందని స్పష్టం చేశారు.మీడియా సమావేశంలో వైఎస్ఆర్సిపి నాయకులు డాల్మిల్ అమీర్ భాషా పాల్గొన్నారు.

# 5 గోల్డ్ మెడల్స్ సాధించిన సింధుజను ఘనంగా సన్మానం చేసిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07: నంద్యాల పట్టణానికి చెందిన దళిత అమ్మాయి ఎంఏ చరిత్ర విభాగంలో కర్ణాటక యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ సాధించి,బెంగళూరు యూనివర్సిటీలో ఒకేసారి 5 గోల్డ్ మెడల్స్ సాధించిన ఘనత, నంద్యాల ఆణిముత్యం సింధుజకే దక్కిందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.



గురువారం గోల్డ్ మెడల్ సాధించిన సింధుజ కు సన్మానం చేసిన అనంతరం ఎంపీ శబరి మాట్లాడుతూ సివిల్స్ చదివి మన రాష్టానికి, దేశానికీ పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని, నీకు అన్ని రకాల సహాయ, సహకారాలు తాను అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు. నంద్యాల పట్టణానికి చెందిన పసేద్దుల, సింధుజా ఎంఏ చరిత్ర విభాగంలో కర్ణాటక యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంక్ రావడం, " 5 " గోల్డ్ మెడల్స్ రావడం నంద్యాల జిల్లా కే గర్వకారణం అన్నారు. ఒక మధ్య తరగతి కుటుంబంలో జన్మించిన సింధుజ చదువుల తల్లిగా నిలిచారని కొనియాడారు. నీవు ఇంతకన్నా పై చదువులు చదుకో నేను నీకు అండగా ఉంటా అని ఎంపీ బైరెడ్డి శబరి భరోసా ఇస్తారు. నీకు అన్ని వేళల సహాయం చేస్తానని, నీ ఉన్నత చదువులకి, సివిల్స్ కి నేను సహకరిస్తానని . ఆదర్య పడకుండా ముందుకు సాగాలని బైరెడ్డి శబరి సింధుజకు హామీ ఇచ్చారు.ఈ కాలంలో ఆడపిల్లలకు చదువు ఎందుకు అని చదుకొని ఎవరిని ఉద్దరిస్తుందని, పెళ్లి చేసి అత్తారింటికి పంపే ఈ రోజుల్లోఎంతో కష్టపడి తినో తినకనో, రెక్కలు ముక్కలు అయ్యేలా పిల్లలకు చదివిస్తే చాలు అని చెప్పి, చదువులకు ఎంత ఖర్చు అయినా కానీ అని అప్పులు చేసి చదివించి ప్రోత్సహం అందించిన తల్లి భారతి, తండ్రి అరుణ్ కుమార్ లను ఎంపీ శబరి అభినందించారు. నంద్యాలలలో 10వ తరగతిలో 9.7 ఫస్ట్ క్లాస్ లో పాస్ అయ్యి, శ్రీ చైతన్య కాలేజీ విజయవాడ 2016 లో ఇంటర్మీడియట్ బైపీసీ లో 90% ఫస్ట్ క్లాస్ మార్కులు సాధించి, 2020, గ్రాడ్యుయేట్ నారాయణ ఐఏఎస్ అకాడమీ హైదరాబాద్ 9.3.సీజీపీ. బ్యాచిలర్స్ అఫ్ ఆర్ట్స్. తరువాత పోస్ట్ గ్రాడ్యుయేట్ 2023 లో కర్ణాటక యూనివర్సిటీలో 7.77.సీజీపీ ఏ, యూనివర్సిటీ ఫస్ట్ "5" గోల్డ్ మెడల్స్ సింధుజ సాధించి, బెంగళూరు యూనివర్సిటీలో గోల్డ్ మెడల్ ,సెంట్రల్ కాలేజీలో గోల్డ్ మెడల్, వినంత కాలేజీలో గోల్డ్ మెడల్, 58 టీహెచ్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్ వారికే నరసయ్య గోల్డ్ మెడల్, 58 టీహెచ్ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, కే.వీరతప్ప గోల్డ్ మెడల్ వచ్చాయంటే ఆమె నిరంతర శ్రమ, చదువుపై అంకిత భావం, పట్టుదల తెలియజేస్తున్నాయని ఎంపీ శబరి , ప్రముఖ పారిశ్రామిక వేత్త బైరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి లు అన్నారు. గోల్డ్ మెడలిస్టు సింధుజ, ఆమె తల్లిదండ్రులు, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, సోషల్ మీడియా ప్రతినిధి దక్క శ్రీకాంత్ తదితరులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం చేతికిచ్చి ఘనంగా సన్మానించారు. ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి గోల్డ్ మెడలిస్టు సింధుజకు మిఠాయి తినిపించి, నీవు సివిల్స్ చదవడానికి నేను అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తానని మరోసారి హామీ ఇచ్చారు.

# చంద్రబాబును అరెస్ట్ చేయడంలో అత్యుత్సాహం చూపిన ఆ ఐపీఎస్ చుట్టూ చక్రవ్యూహం..!

**ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07:** చంద్రబాబు అరెస్ట్ సక్రమమేనని చెప్పే ప్రయత్నం చేశారని కూడి మండిపడుతున్నారు కూటమి నేతలు.ఒక్కో వికెట్ పడుతోంది. సిచ్యువేషన్‌కు తగ్గట్లుగా బౌలింగ్ వేస్తోంది కూటమి సర్కార్. కట్ చేస్తే పక్కా ఎవిడెన్స్‌తో ఒక్కో ఆఫీసర్‌ను రౌండప్ చేస్తోంది. టార్గెట్ చేస్తే క్లీన్ బౌల్డ్ అవ్వాల్సిందేనన్నంత పక్కాగా విచారణ చేస్తోంది. దీంతో అందరి లెక్క తేలుతోంది. వరుసపెట్టి అక్రమాలు బోర్డుకు ఎక్కుతున్నాయి. అప్పటి అరాచకానికి ఇప్పుడు మూల్యం చెల్లించుకోక తప్పని పరిస్థితిని క్రియేట్ చేస్తోంది ఏపీ సర్కార్. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా వ్యవహరించిన వారికి ఉచ్చు బిగిస్తోంది. ఇప్పుడు మాజీ సీఐడీ చీఫ్ సంజయ్ వంతు వచ్చింది. సార్ ఫైల్ రెడీ అయింది. యాక్షన్ మాత్రమే బాకీ ఉంది. లూప్‌లైన్‌లో ఉన్న ఆ అధికారిపై ఇంకేం చర్యలు ఉండబోతున్నాయ్.? కేసులు, విచారణలు తప్పవా.?తాము ఆలిండియా సర్వీస్ అధికారులమని మరిచిపోయారం. అధికారం ఉందని..అప్పటి బాస్ ఫ్రీ హ్యాండ్ ఇచ్చారని అడ్డగోలుగా వ్యవహరించారు. నాటి ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లు నడుచుకున్నారు. వాళ్లు ఏది చెప్తే అది చేశారు. తాము ఆలిండియా సర్వీస్ అధికారులమని, తమకు ఓ రూల్ బుక్ ఉంటుందన్న విషయాన్ని మరిచిపోయారు. ఇలాంటి వారిలో సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ కూడా ఒకరు. అందుకే కూటమి



సర్కారు సంజయ్‌కి పోస్టింగ్ కూడా ఇవ్వకుండా లూప్‌లైన్‌లో పెట్టింది. ఇప్పటికే కొందరు అధికారులు విచారణ, కేసులు ఎదుర్కొంటుండగా.. ఇప్పుడు సంజయ్ వంతు వచ్చింది. పలు అక్రమాల్లో అడ్డంగా దొరికిపోయిన ఆయనపై యాక్షన్‌కు అంతా రెడీ అవుతోంది. సీఐడీ మాజీ చీఫ్, వివాదాస్పద %శ్రూ% సంజయ్ అక్రమాల చిట్టా మామూలుగా లేదు. వివిధ శాఖల అధిపతిగా ఉన్నప్పుడు ఆయన వ్యవహరించిన తీరు..చేసిన అవినీతి, అక్రమాలు అన్నీ బయటికి వస్తున్నాయి.

**అధికార హోదాను అడ్డుపెట్టుకొని రూ.కోటి మిస్‌యూజ్.**

సంజయ్ ఫైర్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జనరల్‌గా పని చేసినప్పుడు..అధికార హోదాను అడ్డుపెట్టుకొని కోటి రూపాయలు మిస్‌యూజ్ చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తేల్చింది. సౌత్రిక టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థతో కుమ్మక్కైనట్లు పనులు చేయకుండానే చెల్లింపులు చేశారట. బిడ్డింగ్‌లో రిగ్గింగ్ చేయడంతో పాటు టెండర్లు కట్టబెట్టడంలో రూల్స్ ఫాలో కాలేదని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ గుర్తించింది. రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చి సంజయ్‌పై కేంద్ర సివిల్ సర్వీస్ రూల్స్ ప్రకారం యాక్షన్ తీసుకోవాలని సిఫార్సు చేసింది.

**కోటి రూపాయలలో ఖర్చు చేసింది 3 లక్షలే..**

ఫైర్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌లో ఐపాడ్‌లు, ల్యాప్‌టాప్‌ల కొనుగోళ్లలోనూ అక్రమాలే జరిగాయట. టెండర్లు, కాంపిటీటివ్ బిడ్లు లేకుండానే ఆర్డర్లు ఇచ్చేశారు. కనీసం బిల్లులూ సబ్‌మిట్ చేయలేదు. ఇలా అక్రమాల స్టోరీ మామూలుగా లేదట. వెబ్‌సైట్, మొబైల్ యాప్ డెవలప్‌మెంట్, ట్యాబ్‌ల సప్లై కోసం భారీగా బిల్లులు చెల్లించినట్లు తెలుస్తోంది. అంతే కాదు ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన కల్పిస్తానంటూ ఓ భారీ బాధ్యతల్లోకి దిగిపోయిన సంజయ్..నాటి జగన్ సర్కారు నుంచి ఏకంగా రూ.1 కోటిని విడుదల చేయించుకున్నారట. ఇందులో ఆయన కేవలం రూ.3 లక్షలు మాత్రమే ఖర్చు చేశారట.

**చంద్రబాబును అరెస్ట్ చేయడంలో అత్యుత్సాహం చూపించారని ఆగ్రహం..**

ఎన్. సంజయ్‌కి మొదట్లో మంచి పేరు ఉండేది. కానీ ఇప్పుడు విధి నిర్వహణలోనే తనదైన మార్కు అవినీతి అక్రమాలతో ఇరుక్కున్నారు. త్వరలో అరెస్ట్ అయ్యే అవకాశం ఉందంటున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే లూప్‌లైన్‌లో ఉన్న ఈ ఆఫీసర్ ఇక తన మిగిలిన సర్వీసును ఎలా ముగిస్తారన్న దానిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. వైసీపీ అధికారంలో ఉండగా జగన్ దృష్టిని ఆకర్షించిన సంజయ్.. ఏకంగా సీఐడీ చీఫ్‌గా పదవి దక్కించుకున్నారు. స్కిల్ డెవలప్ మెంట్ కేసులో చంద్రబాబును అరెస్ట్ చేయడంలో సంజయ్ అత్యుత్సాహం చూపించారని టీడీపీ ఆగ్రహంతో ఉంది.తర్వాత చంద్రబాబు అరెస్ట్ సక్రమమేనని చెప్పే ప్రయత్నం చేశారని కూడ మండిపడుతున్నారు కూటమి నేతలు. నాటి అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ రెడ్డితో కలిసి ఢిల్లీకి వెళ్లి అక్కడ మీడియా సమావేశం పెట్టడం టీడీపీకి ఆగ్రహం తెప్పించింది. ఈ క్రమంలోనే ఆయన అక్రమాలపై విజిలెన్స్ విచారణ చేయించింది. రిపోర్ట్ రెడీ అయింది. నెక్స్ట్ స్టెప్ ఏంటదన్నది ఉత్కంఠ రేపుతోంది.

# అగ్రిగోల్డ్ కేసు... అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసిన ఈడీ

**అగ్రిగోల్డ్ ఫాంఎస్టేట్స్ సహా 11 కంపెనీలపై ఛార్జీషీట్**

**ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం**

**అగ్రిగోల్డ్ అంశంలో తెలంగాణ, ఏపీ సహా పలు రాష్ట్రాల్లో కేసులు నమోదు**




ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 07: అగ్రిగోల్డ్ కేసులో ఈడీ అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. అగ్రిగోల్డ్ ఫామ్ ఎస్టేట్స్ సహా 11 అనుబంధ కంపెనీలపై ఈ అనుబంధ ఛార్జిషీట్‌ను దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుంది.అగ్రిగోల్డ్‌కు సంబంధించి ఈడీ... మనీలాండరింగ్ చట్టం కింద గతంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తోంది. ఈ అంశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఒడిశా, అండమాన్‌లో కేసులు నమోదయ్యాయి. 32 లక్షల ఖాతాదారుల నుంచి రూ.6,380 కోట్లను వసూలు చేసినట్లు దర్యాప్తులో ఈడీ గుర్తించింది. దీంతో అగ్రిగోల్డ్‌కు చెందిన రూ.4,141 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. ఈ కేసులో ఈడీ ఇప్పటికే 14 మందిని అరెస్ట్ చేసింది. 130 షెల్ కంపెనీల ద్వారా నిధులు బదలాయించినట్లు గుర్తించింది. అగ్రిగోల్డ్ డబ్బులను ఎండీ వెంకటరామారావు ఇతర ఖాతాలకు మళ్లించాడని, మళ్లించిన నిధులతో పవర్, రియల్ ఎస్టేట్, ఎంటర్‌టైన్‌మెంట్, ఫార్మా రంగాల్లో పెట్టుబడులు పెట్టాడని వెల్లడైంది.

# అగ్ని ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ సహాయం



ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 07: మహానంది మండలం గాజులపల్లి గ్రామంలోని కొత్తకోట్టాలలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించి బాధితులు నక్క సుబ్బుడు లింగమయ్య సర్వం కోల్పోయారు.గురువారం మహానంది ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తాహశీల్దార్ రమాదేవి చేతుల మీదుగా వంట సామాగ్రి, దుప్పట్లు, తార్పన్ పట్టాలు, 50 కేజీల బియ్యం, నిత్యవసర సరుకులు,కురగాయలు అందజేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ అగ్ని ప్రమాద బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అగ్రి ప్రమాదంలో సర్వం కోల్పోవడం చాలా బాధాకరమని, దీనిపై పై అధికారులకు నివేదికలు పంపి, బాధిత కుటుంబాలకు, ఆర్థిక భరోసా, న్యాయాన్ని అందజేస్తామన్నారు. అనంతరం ఆంజనేయ పురం గ్రామంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, ప్రజలకు మందులను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో వీఆర్వో జేజి బాబు, రెడ్ క్రాస్ సొసైటీ మండల వైస్ చైర్మన్ అమర్నాథ్, టిడిపి నాయకులు గంగవరపు ఉమామహేశ్వర్ రెడ్డి, శ్రీశైలం దేవస్థానం మాజీ ధర్మకర్త రవి స్వామి, రెడ్ క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులు పి.కమలాకర్ నాయుడు, సి. శ్రీనివాసులు, లాల్ మదర్, మద్దిలేటి, సురేష్, సత్యనారాయణ,మదన శేఖర్, పొన్నపాటి, తలారి కాశన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కవర్లు,టీ గ్లాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు.!

## -క్యాన్సర్ కు కారణం టీ కప్పులు.
## -రోడ్లపై ఎక్కడపడితే అక్కడ టీ కప్పులు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 07: రాష్ట్రవ్యాప్తంగా ప్లాస్టిక్,టీ కప్పులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హెటల్స్ లో అధికంగా టీ కప్పుల వాడుకం అధికం అయింది.పేపరు,ప్లాస్టిక్ కప్పుల్లో టీ తాగడం వల్ల క్యాన్సర్ భారిన పడుతున్నారని ప్రచార మాధ్యమాల్లో రావడంతో ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్దం అయింది.టీ,ప్లాస్టిక్ కప్పులు రోడ్లపై,కాల్వల్లో ఎక్కడ పడితే అక్కడ పడ వేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.వివరాల్లోకి వెళితే నంద్యాల పట్టణం లో ప్లాస్టిక్,టీ కప్పుల విక్రయాల దుకాణాలు అధికంగా ఉన్నాయి.ప్రతి ఒక్కరికీ ప్లాస్టిక్ కవర్లు నిత్యావసరంగా మారిపోయింది.సరుకులు, పళ్లు కొనాలంటే గతంలో సంచులు వాడేవారు.మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాషన్ గా కవర్లు వాడకం అధికం అయింది.ఇటీవల టీ కప్పులు వాడటం వల్ల క్యాన్సర్ భారిన పడుతున్నారని అన్ని కార్పొరేషన్,మున్సిపాలిటీ లకు ప్లాస్టిక్,టీ కప్పుల విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు.ఈ నేపథ్యంలోనే మున్సిపల్ అధికారులు నంద్యాల పట్టణం లో ప్లాస్టిక్,టీ కప్పులు విక్రయాలు చేస్తున్నవారి వివరాలు గోప్యంగా సేకరిస్తున్నట్లు సమాచారం.లక్షల్లో ప్లాస్టిక్,టీ కప్పుల వ్యాపారాలు జరుగుతున్న విషయం విధితమే.ప్లాస్టిక్,టీ కప్పులు రోడ్లపై,కాల్వల్లో వేస్తుందడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.టీ కప్పులు,ప్లాస్టిక్ కవర్లు మూగజీవాలు తినడంవల్ల అనారోగ్యాల భారిన పడుతున్న విషయం తెలిసిందే.ఇటీవల ఆత్మకూరు బస్ స్టాండ్ వద్ద ఒక గోమాత కడుపులో ప్లాస్టిక్,టీ కప్పులు తినడంతో అనారోగ్యానికి గురికావడంతో వైద్యులు ఆపరేషన్ చేసి ప్లాస్టిక్,టీ కప్పు లు తొలగించిన విషయం తెలిసిందే.ప్రభుత్వాలు ప్లాస్టిక్,టీ కప్పులు చేసే పెద్ద,పెద్ద కంపెనీలలో తయారుచేయకుండా కట్టడి చేస్తే చిన్న,చిన్న వ్యాపారులకు ఇబ్బందులు ఉండవు.ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్లాస్టిక్,టీ కప్పుల వ్యాపారులపై అధికారులు దాడులు చేయడం ఇబ్బందులు కలిగిస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు అనుకుంటే ఏమైనా చేస్తారని,ఎప్పుడు దుకాణాలు తనిఖీలు చేస్తారో అని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

